సాక్షి
ఖమ్మం
శుక్రవారం : 24 : మే : 2024



రసాభాసగా కాంగ్రెస్ సమావేశం

కారేపల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశం రసాభాసగా ముగిసింది. 8లో



లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

ఏన్కూరు మండలం గార్లఒడ్డుతో పాటు ఖమ్మంలోని స్తంభాద్రి ఆలయంలో శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 29°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం తర్వాత మాత్రం ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందచేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్న దానానికి భక్తులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన దేవిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి–దుర్గాభవాని దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మకు అందచేసి స్వామిని దర్శించుకున్నారు. కాగా, పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను గరుఢ వాహనంపై గిరి ప్రదక్షణ చేయించారు. ఆలయ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రచారం



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న ఉప ఎన్నిక జరగనుండగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి తరఫున ప్రచారంలో ఆయన పాల్గొంటారు. ఉదయం 10–30 గంటలకు సత్తుపల్లి, మధ్యాహ్నం 2.30 గంటలకు మధిర నియోజకవర్గంలోని బోనకల్, సాయంత్రం 5–30 గంటలకు పాలేరు నియోజకవర్గం బారుగూడెంలో జరిగే పట్టభద్రులు, పార్టీ శ్రేణుల సమావేశాల్లో హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడనున్నారు. కాగా, హరీశ్‌రావు గురువారం సాయంత్రం ఖమ్మంలోని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్సీ తాతా మధు, నాయకుడు ఉప్పల వెంకటరమణ తదితరులు స్వాగతం పలికారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా తనిఖీ



విద్యుత్ సరఫరాను పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు ఏర్పడిన నేపథ్యాన అధికారులు అప్రమత్తమయ్యారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలతో గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో విద్యుత్ సరఫరాను ఎస్ఈ ఏ.సురేందర్ నేతృత్వాన అధికారులు తనిఖీ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌తో కలిసి విద్యుత్ సరఫరాను పరిశీలించిన అధికారులు.. రెండు శాఖల సమన్వయంతో అంతరాయాలు ఏర్పడకుండా చూడాలని నిర్ణయించారు. ఖమ్మం టౌన్ డీఈ నంబూరి రామారావు, టౌన్–3 ఏఈ తావుర్యా తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు రెండో ఏడాది అనుమతి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలను నేషనల్ మెడికల్ కమిషన్ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ఎంబీబీఎస్ రెండో ఏడాది నిర్వహణ కోసం అనుమతులు జారీ చేసేందుకు గాను వర్చువల్‌గా పరిశీలించిన వివరాలు ఆరా తీశారు. గత ఏడాది ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల మొదలుకాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రెండో ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర అంశాలను ఎన్ఎంసీ బృందం నేరుగా తనిఖీ చేయాల్సి ఉండగా, వర్చువల్ విధానంలో పరిశీలించింది. ప్రిన్సిపాల్, వివిధ విభాగాల హెచ్ఓడీలతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. కళాశాలలో సౌకర్యాలపై ఎన్ఎంసీ బృందం సంతృప్తి చెందిన నేపథ్యాన రెండో ఏడాది తరగతులకు అనుమతులు జారీ చేసిందని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బీ.కిరణ్‌కుమార్, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

రేసులో.. ముందుండేలా..






తీన్మార్ మల్లన్న



ఏనుగుల రాకేష్‌రెడ్డి



గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



పాలకూరి అశోక్‌కుమార్

హోరెత్తుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీల కసరత్తు
- అగ్రనేతలను రంగంలోకి దించిన పార్టీలు
- మేము సైతం అంటున్న స్వతంత్ర అభ్యర్థులు
- రేపటితో ముగియనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రచారం

నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉండగా.. ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల మధ్య ఆసక్తికరమైన పోరు నెలకొంది. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితోపాటు స్వతంత్ర అభ్యర్థి, ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత పాలకూరి అశోక్ కుమార్ మధ్య రసవత్తరమైన పోటీ ఏర్పడింది. పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభ్యర్థులు క్షణం తీరిక లేకుండా ప్రచారాన్ని కదం తొక్కిస్తున్నారు. ఉమ్మడి జిల్లాను మూడు పార్టీలు బలపర్చిన అభ్యర్థులు, వారి తరఫున అగ్రనేతలు చుట్టేస్తున్నారు. కాగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం ముగియనుండగా, సోమవారం పోలింగ్ జరుగుతుంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

4.60 లక్షల మంది ఓటర్లు

మూడు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించి ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 4.60 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధికులను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు శ్రమిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులే లక్ష్యంగా ప్రచారం జరుగుతోంది. ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉద్యోగుల సమస్యలే ప్రధానాస్త్రంగా అగ్రనేతలు మొదలు అభ్యర్థుల వరకు ఓటర్లుగా ఉన్న నిరుద్యోగులను ఆకట్టుకునేలా ప్రసంగాలు చేస్తున్నారు.

స్పీడ్ పెంచిన తీన్మార్..

కాంగ్రెస్ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రచారంలో వేగం పెంచారు. 2021లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండోస్థానంలో నిలిచిన ఆయన 83,290 ఓట్లు సాధించారు. అయితే ఈసారి కాంగ్రెస్ మద్దతుతో పోటీకి దిగడంతో సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, టీజేఎస్ పార్టీలు ఆయనకు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యాన తన గెలుపు నల్లేరుపై నడకేనని ఆయన భావిస్తున్నారు. కొద్ది రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రచారం చేస్తున్న ఆయన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలతో కలిసి ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

సిట్టింగ్ దక్కించుకునేలా..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును బీఆర్ఎస్ ప్రతిష్టాత్మంగా తీసుకుంది. ఇప్పటికే అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఉమ్మడి జిల్లాను కలియదిరిగారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అత్యధిక ఓట్లు సాధించడం.. ప్రస్తుతం ఉప ఎన్నికలోనూ సిట్టింగ్ సీటును దక్కించుకోవాలనే పట్టుదలతో ఆ పార్టీ నేతలున్నారు. గత ఎన్నికల్లో పల్లా రాజేశ్వరరెడ్డికి 1,10,840 ఓట్లు వచ్చాయి. ఈసారి కూడా అత్యధిక ఓట్లు సాధించి గెలుపు దరిచేరాలనే భావనలో అభ్యర్థి ఉన్నారు. ఇందులో భాగంగా స్థానిక నేతలు అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొంటుండగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు సన్నాహక సమావేశాలకు హాజరయ్యారు. ఇక మాజీ మంత్రి హరీశ్‌రావు శనివారం సత్తుపల్లి, మధిర నియోజకవర్గం బోనకల్, పాలేరు నియోజకవర్గం బారుగూడెంలో జరిగే సమావేశాల్లో పాల్గొననున్నారు.

2021 ఎన్నికలో అభ్యర్థులకు పోలైన ఓట్లు

అభ్యర్థి	బలపర్చిన పార్టీ	ఓట్లు
పల్లా రాజేశ్వరరెడ్డి	బీఆర్ఎస్	1,10,840
తీన్మార్ మల్లన్న	స్వతంత్ర	83,290
ప్రొఫెసర్ కోదండరామ్	టీజేఎస్	70,072
ప్రేమేందర్‌రెడ్డి	బీజేపీ	39,107
రాములునాయక్	కాంగ్రెస్	27,588

బీజేపీ విస్తృత ప్రచారం

కమలనాథులు ప్రచార ఊపు పెంచారు. ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి తోడు జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఇతర నేతలు ప్రచారంలో పాల్గొంటూ ఉద్యోగ, నిరుద్యోగ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే సత్తా తమకే ఉందని చెబుతున్నారు. అలాగే, అభ్యర్థి తరపున ఇప్పటికే పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ జిల్లాలో ప్రచారం నిర్వహించగా.. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశాలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కొత్తగూడెంలో జరిగిన సమావేశానికి గురువారం మాజీ ఎమ్మెల్యే రఘునందర్‌రావు హాజరయ్యారు. గత ఎన్నికల్లోనూ పోటీ చేసిన ప్రేమేందర్‌రెడ్డికి 39,107 ఓట్లు రాగా.. ఈసారి అంతకుమించి వస్తాయనే నమ్మకంతో ఉన్నారు.

సమస్యలే అజెండాగా..

నిరుద్యోగుల సమస్యలే అజెండాగా స్వతంత్ర అభ్యర్థులు ఈ ఎన్నికల్లో ప్రచారాన్ని కదం తొక్కిస్తున్నారు. ఇందులో అశోక అకాడమీ చైర్మన్ పాలకూరి అశోక్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా విద్యార్థులు, నిరుద్యోగ సమస్యలపై గళం వినిపిస్తానని చెబుతున్నారు. ఆయన గత ప్రభుత్వం అనుసరించిన విధానాలపై, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాసమస్యలపై పోరాటాలు నిర్వహించారు. ఈమేరకు ఆయన అకాడమీ విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లో తనకు ఉన్న పరిచయాలతో ఆయన ప్రచారంలో వేగం పెంచగా.. ఇప్పటికే మూడు ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలను కలిసి తనకు ఓటు వేయాలని కోరారు.

భూనిర్వాసితులను ఆదుకుంటాం

- 'సీతారామ'కు భూమి ఇచ్చిన రైతులకు పాదాభివందనం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పనులను పరిశీలిస్తున్న మంత్రి నాగేశ్వరావు, పక్కన ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఏన్కూరులో జరుగుతున్న సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు పనులను గురువారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తించి ఎకరం, అర ఎకరం భూమి ఉన్నా సరే ఇచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. సీఎంతో మాట్లాడి భూ నిర్వాసితులను ఆదుకుంటామని చెప్పారు. అలాగే, ఎన్నికల కోడ్ ముగిశాక కలెక్టర్‌తో చర్చిస్తానని తెలిపారు. కాగా, సీతారామ ప్రాజెక్టులో నాలుగు పంప్‌హౌస్‌లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు ద్వా రా లక్షన్నర ఎకరాలకు ఈ ఏడాది సాగు నీరు అందించాలనేది లక్ష్యమని తెలిపారు. ఈమేరక సాగర్ కాల్వ, వైరా రిజర్వాయర్, లంకాసాగర్ ప్రాజెక్టు, కల్లూరు పెద్ద చెరువుకు నీరు ఇస్తూనే ఎత్తిపోతల పథకాలు కూడా నడిచేలా చూస్తామని వెల్లడించారు. అధికారులు పరిశీలిస్తూ వర్షాలు వచ్చేనాటికి ప్రధాన పనులు పూర్తి చేయించాలని సూచించారు.

రూ.40 లక్షలు పరిహారం ఇవ్వాలి

ప్రాజెక్టు నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలని పలువురు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుతో భూమి కోల్పోయింది ఎక్కువగా గిరిజన రైతులే ఉన్నందున ఆదుకోవాలని విన్నవించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, గుత్త వెంకటేశ్వరావు, వేముల కృష్ణ ప్రసాద్, స్వర్ణ నరేందర్, ముక్తి వెంకటేశ్వర్లు, మేడ ధర్మారావు, స్వర్ణ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ పూర్తయ్యాకే ప్రైవేట్‌కు..

- మిల్లు నుంచి ప్రతీరోజు 6 ఏసీకే బియ్యం ఇవ్వాలి
- తనిఖీల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



రాజేశ్వరపురంలోని రైస్‌మిల్లులో స్టాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

నేలకొండపల్లి: లక్ష్యం మేరకు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇచ్చేవరకు మిల్లుల నుంచి ఒక క్వింటా కూడా ప్రైవేట్ మార్కెట్‌కు పంపడానికి అనుమతించబోమని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని అరుణాచల శివ రైస్ మిల్లును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మిల్లు సామర్థ్యం, ధాన్యం నిల్వలపై ఆరా తీశాక ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో సీఎంఆర్ కింద 112 ఏసీకేల బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 22 ఏసీకే మాత్రమే ఇచ్చారని అధికారులు తెలిపారు. దీంతో జూన్ నాటికి లక్ష్యాన్ని పూర్తిచేసేలా రోజుకు 6 ఏసీకేల బియ్యం అందజేయాలని యాజమాన్యాన్ని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక లక్ష్యం పూర్తయ్యే వరకు ప్రైవేట్ మార్కెట్‌కు బియ్యం తరలించొద్దని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, తహసీల్దార్ గౌరీశంకర్, ఆర్ఐ ఆలస్యం మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ధరణి దరఖాస్తుల పరిష్కారం

ఖమ్మం రూరల్/ఖమ్మం అర్బన్: ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన నెలాఖరులోగా పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంను గురువారం తనిఖీ చేసిన ఆయన ధరణి దరఖాస్తులపై సమీక్ష చేశారు. ఖమ్మం రూరల్ మండలంలో 176 దరఖాస్తులు, 10 రిజిస్ట్రేషన్ స్లాట్లు, ఖమ్మం అర్బన్ మండలంలో 171, రిజిస్ట్రేషన్ స్లాట్లు 10 పెండింగ్ ఉన్నాయని తహసీల్దార్లు పి.రాంప్రసాద్, సీహెచ్.స్వామి తెలిపారు. వీటిని నెలాఖరులోగా పరిష్కరించేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

నేటి నుంచి రైతులకు అవగాహన సదస్సులు

వీసీలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు



వీసీలో పాల్గొన్న డీఏఓ విజయనిర్మల, ఏడీఏలు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం పంట సీజన్ సమీపిస్తున్న నేపథ్యాన ప్రభుత్వం విత్తనాల విక్రయంపై దృష్టి సారించింది. ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈమేరకు విత్తన విక్రయాల్లో అక్రమాలు జరగకుండా, నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా పర్యవేక్షించేందుకు ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేస్తోంది. ఈక్రమంలో గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, కమిషనర్ డాక్టర్ బి.గోపి హైదరాబాద్ నుంచి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈసమావేశానికి జిల్లానుంచి జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, సరిత, ఏ.శ్రీనివాసరావు, కొంగర వెంకటేశ్వరరావు, కరుశ్రీ, ఎస్.విజయచంద్ర, యూ.నర్సింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ శుక్రవారం నుంచి గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 7–30 నుంచి 11–30 గంటల వరకు రోజుకు రెండు గ్రామాల్లో నిర్వహించే సమావేశాల్లో ఏఓలు, ఏఈఓలు పాల్గొని రైతులకు సలహాలు ఇవ్వాలని తెలిపారు. ఈమేరకు రైతులకు వివరించాల్సిన అంశాలపైనా అధికారులు దిశానిర్దేశం చేశారు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాలకు వచ్చి లూజ్‌గా విక్రయించే వారిని నమ్మొద్దని, ప్రతీ కొనుగోలు సందర్భంగా ప్యాకెట్‌పై అన్ని వివరాలు పరిశీలించడమే కాక రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకునేలా రైతులకు అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

నేడు డీలర్ల సమావేశం

కలెక్టరేట్‌లో శుక్రవారం విత్తన డీలర్లు, విక్రయదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. విత్తన అమ్మకాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై చర్చించనున్న ఈ సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని డీలర్లు, వ్యవసాయాధికారులు మధ్యాహ్నం 3గంటలకు మొదలయ్యే సమావేశానికి హాజరుకావాలని డీఏఓ విజయనిర్మల సూచించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 42 కేంద్రాలు, 14,984మంది విద్యార్థులు
- ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా



మధిరలోని పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం మొదలుకానున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు జిల్లాలో 42కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈమేరకు 14,984 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10,352మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,632మంది ఉన్నారు.

సీసీ కెమెరా నిఘాలో..

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనుండగా.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2–30నుంచి 5–30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు పకడ్బందీగా జరిగేలా జిల్లా పరీక్షల కమిటీ, హైపర్ కమిటీ, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ప్రతీ కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, ట్ల డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ విధులు నిర్వర్తిస్తారు. కాగా, రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను సైతం పటిష్ట నిఘా మధ్య నిర్వహించేలా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఇక విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తూనే వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు.

వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో రామయ్య నిత్యకల్యాణం గురువారం కమనీయంగా సాగింది. శ్రీ సీతారామ చంద్రస్వామివారికి తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

మళ్లీ మండుతున్న ఎండలు

రాత్రి ఈదురుగాలులు, వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండలు మళ్లీ పెరిగాయి. అకాల వర్షాలతో గడిచిన పది రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మార్చి, ఏప్రిల్‌తోపాటు ఈనెల మొదటి వారం వరకు ఎండ గరిష్ఠస్థాయిలో నమోదు కాగా ఆ తర్వాత తగ్గాయి. అయితే, రెండు రోజులుగా ఎండ పుంజుకోగా, ఉక్కపోతతో ప్రజలు సతమతమవుతున్నారు. ఈనెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుండడంతో ఎండ ఇంకా పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

పలుచోట్ల వర్షం, ఈదురుగాలులు

జిల్లా అంతటా గురువారం మధ్యాహ్నం వరకు గరిష్టస్థాయిలో ఎండలు నమోదు కాగా.. సాయంత్రం తర్వాత ఈదురుగాలులు మొదలయ్యాయి. పలు ప్రాంతాల్లో ఈ ప్రభావం ఉండగా, రాత్రి వర్షం కూడా కురిసింది. దీంతో వాతావరణం చల్లబడగా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈదురుగాలులు, అకాల వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఉద్యోగులు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వైరా, కొణిజర్ల తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా ఖమ్మం, చింతకాని, ముదిగొండ, బోనకల్, ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోనూ వర్షపాతం నమోదైంది.

ప్రశ్నార్థకంగా రాష్ట్ర మనుగడ

- నాడు కేసీఆర్.. ఇప్పుడు కాంగ్రెస్ పాలకుల దోపిడీ
- అందుకే తెలంగాణ ప్రజల చూపు బీజేపీ వైపు...
- మేధావులు, పట్టభద్రుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం: గత, ప్రస్తత పాలకుల తీరుతో తెలంగాణ రాష్ట్ర మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఖమ్మం వచ్చిన ఆయన విద్యాసంస్థల అధినేతలు, వైద్యులు, న్యాయవాదులు, లెక్చర్లలతో పాటు పట్టభద్రులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో కేసీఆర్, గత ఆరు నెలల పాలనలో కాంగ్రెస్ రాష్ట్రాన్ని దోపిడీ చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన విషయాన్ని గుర్తించిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. ఈవిషయమై మేధావులు, విద్యావంతులు కూడా ఆలోచించి నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అధికారం కోసం కాకుండా దేశం, ధర్మం కోసం పనిచేయకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని తెలిపారు.

పతనమవుతున్న విలువలు

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోనుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీకి ఓటింగ్ శాతం పెరుగుతుందని తెలిపారు. కాగా, రాష్ట్ర రాజకీయాల్లో నైతిక విలువలు పతనమవుతున్నాయని.. గెలిచాక ఏ పార్టీలోకి వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ అధికారం కోసం నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ తదితర హామీలు ఇవ్వగా ఏదీ నెరవేర్చలేదని విమర్శించారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగెత్తిపోగా.. రేవంత్‌రెడ్డి మాత్రం పదేళ్లుగా తానే సీఎంనని చెప్పుకుంటున్నారన్నా రు. ఏదిఏమైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి అధికారం చేపడుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల యజమానులు బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు రఘునందనరావు, మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తాండ్ర వినోద్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యాన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యాన ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుంది. ఈ మేరకు త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్‌ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్, శారీ డ్రాపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25 వరకు ఖమ్మం మామిళ్లగూడెంలోని లహరి బ్యూటీపార్లర్, ట్రైనింగ్ సెంటర్‌లో రూ.3 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి సమాచారం కోసం 96660 13544, 96182 18701 నంబర్లలో సంప్రదించాలి.

అమలోద్భవి మాత దేవాలయం ప్రారంభం

హాజరైన ఖమ్మం పీఠాధిపతి ప్రకాశం



పీఠాధిపతి ప్రకాశంతో ఎమ్మెల్యే, తదితరులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలో పునర్నిర్మించిన అమలోద్భవి మాత దేవాలయాన్ని ఖమ్మం పీఠాధిపతి బిషప్ సగిలి ప్రకాశం, విశ్రాంత పీఠాధిపతి డాక్టర్ మైపస్ పాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రకాశం మాట్లాడారు. క్రీస్తు జీవితాన్ని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేదలకు సాయం చేసే గుణం కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పాదిలి హరినాథ్, పమ్మి అశోక్, కమిటీ సభ్యులు నంద్రు నాగరాజు, ఇండ్ల పుల్లయ్య, తాడికొండ రాంబాబు, ఎన్.గోపి, కర్రి నాగభూషణం, సురేష్, బాలు, ఆనందరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన కాంగ్రెస్ అభ్యర్థి



సీసీ టీవీ పుటేజీని పరిశీలిస్తున్న రఘురాంరెడ్డి, నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికల ఈవీఎం స్ట్రాంగ్ రూంను ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ టీవీ పుటేజీ ద్వారా భద్రతపై ఆరా తీసిన ఆయన అధికారులతో మాట్లాడి ఇతర వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, కొప్పుల చంద్రశేఖర్‌రావు, నరాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

108 టెక్నీషియన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకట్

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని 108లో విధులు నిర్వర్తిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అడపాల వెంకట్‌కు రాష్ట్ర ఉత్తమ సేవా అవార్డు లభించింది. ప్రమాద బాధితులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా స్పందించిన ఆయన రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఈఎంటీగా ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా ప్రోగ్రాం అధికారి భూమా నాగేందర్‌రావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రణయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వెంకట్‌ను ఉద్యోగులు అభినందించారు.

గేదను ఢీకొట్టిన కారు, ఇద్దరికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక ఎస్సీ కాలనీ వద్ద ప్రధాన రోడ్డుపై గురువారం రాత్రి ఓ గేదెను కారు ఢీకొట్టింది. ఈఘటనలో గేదె ఎగిరి పక్కనే వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిపై పడడంతో వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులుమండలంలోని వీఆర్.బంజర వాసులుగా తెలుస్తుండగా వారిని ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

రసాభాసగా కాంగ్రెస్ సమావేశం

- ఇటీవల పార్టీలో చేరిన వారిని తొలుత పిలిచారని ఆగ్రహం
- ఎమ్మెల్యే సమక్షాన వాగ్వాదం, వెళ్లిపోయిన మంత్రి వర్గీయులు



ఎమ్మెల్యే రాందాస్ సమక్షాన వాగ్వాదానికి ఇరువర్గాల నాయకులు

కారేపల్లి: కారేపల్లిలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సమక్షాన ఇరువర్గాలు వాదనకు దిగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు స్టేజీ దిగి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ వారిని సముదాయించినా ఫలితం లేకపోయింది. వివరాల్లోకి వెళ్తే... కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ సమావేశం కారేపల్లిలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా సంతగుడి మాజీ చైర్మన్ మల్లెల నాగేశ్వరరావు నాయకులను వేదికపైకి ఆహ్వానిస్తున్నారు. ఈక్రమంలో సొసైటీ డైరెక్టర్ బానోతు హీరాలాల్, గుగులోతు భీముడు తదితరులు మొదటి నుంచి కాంగ్రెస్‌లో పనిచేసిన వారిని కాకుండా ఇటీవల చేరిన వారిని ముందుగా పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కష్టపడే నాయకులకు ఇచ్చే విలువ ఇదేనా అని ప్రశ్నించగా, యువజన కాంగ్రెస్ నాయకుడు వినోద్‌తో పాటు, ఎమ్మెల్యే వర్గీయులు వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో ఎమ్మెల్యే రాందాస్, బొర్రా రాజశేఖర్, పగడాల మంజుల, టోనీవీరప్రతాప్ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదు. ఇంతలోనే ఎమ్మెల్యే తమను స్టేజీ దిగమన్నారని నిరసన వ్యక్తం చేస్తూ ఇమ్మడి తిరుపతిరావు, మల్లేల నాగేశ్వరరావు, గుగులోతు శ్రీను తదితరులు కింద దిగారు. అనంతరం ఎమ్మెల్యే, రాజశేఖర్ సమావేశాన్ని కొనసాగిస్తూ తీన్మార్ మల్లన్న విజయానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు.

ఘనంగా శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

భక్తులతో కళకళలాడిన గార్లఒడ్డు ఆలయం



గార్లఒడ్డులో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఖమ్మం స్తంభాద్రి ఆలయంలో...

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డులో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి 9.05 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా జరిపించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో కల్యాణాన్ని తిలకించగా, ఈఓ శేషయ్య, వేద పండితులు వేణుగోపాలచార్యులు, నాగరాజు ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

స్తంభాద్రి ఆలయంలో...

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి ఆలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు మొదలుకాగా, మూలవిరాట్‌కు 108 కలశాల్లోని జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని పట్టువస్త్రాలతో అలంకరించి సుదర్శన యాగం, సాయంత్రం ముత్యాల తలంబ్రాల ఊరేగింపు, ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహించారు. ఆపై రాత్రి 7 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిపించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, అర్చకులు, పండితులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం



వీసీకి హాజరైన సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంక్రైం: కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్, అడిషనల్ డీజీపీ అభిలాషాబిస్త్ సూచించారు. హైదరాబాద్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె పోలీసు అధికారులతో మాట్లాడారు. కొత్తగా మూడు క్రిమినల్ చట్టాలు జూలై 1నుంచి అమల్లోకి రానున్న నేపథ్యాన పోలీస్ అధికారులు విడతల వారీగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆయా ఉద్యోగులు జిల్లాల్లో పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా నుంచి వీసీకి హాజరైన సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, సీఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో నేలకు జీవం



రైతులకు విత్తనాలు అంద చేస్తున్న డీఏఓ విజయనిర్మల, అధికారులు

కల్లూరు: రైతులు పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా నేలకు జీవం వస్తుందని, ఆపై సాగుచేసే పంటల దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల తెలిపారు. కల్లూరు సొసైటీలో గురువారం ఆమె రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. జీలుగులు 30 కేజీల బ్యాగ్ ధర రూ.2,790 ఉండగా 60 శాతం సబ్సిడీపై రూ.1,116కు విక్రయించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 10,623 క్వింటాళ్ల జీలుగులు, 113 క్వింటాళ్ల పిల్లిపెసర, 110 క్వింటాళ్ల జనుము అందుబాటులో ఉన్నాయన్నారు. సత్తుపల్లి ఏడీఏ యు.నర్సింహారావు, ఏఓ ఎం.రూప, సొసైటీ సీఈఓ బీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల తగాదాలో వృద్ధుడు మృతి



వివరాలు సేకరిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

కూసుమంచి: కుటుంబసభ్యుల మధ్య ఘర్షణను వారించేందుకు వెళ్లిన ఓ వృద్ధుడిని బలంగా నెట్టివేయటంతో కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఇది. కూసుమంచి మండలం గోరీలపాడు తండాలో గురువారం చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. గోరిపాడు తండాకు చెందిన తేజావత్ సురేష్ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ఆయన భార్య నగ్మా స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వర్తిస్తోంది. అయితే, భార్యాభర్తల నడుమ కొంతకాలంగా గొడవలు జరుగు తున్నాయి. ఈక్రమంలోనే గురువారం ఉదయం సురేష్ బావమరిది దేవీలాల్, అత్త సక్కు ఆయన ఇంటికి వచ్చారు. ఈమేరకు నగ్మా, ఆమె సోదరుడు, తల్లి కలిసి సురేష్‌తో ఘర్షణకు దిగారు. తొలుత సురేష్ తల్లి సుశీల అడ్డురాగా ఆమెను కోడలు నగ్మా కర్రతో తలపై కొట్టగా గాయపడింది. దీన్ని గమనించిన తాత బిచ్చు(70) గొడవ వద్దంటూ నచ్చచెప్పేందుకు రాగా సురేష్ బావమరిది దేవీలాల్ ఆయనపై దాడిచేస్తూ బలంగా నెట్టివేయగా గోడకు గుద్దుకుని పక్కనే ఉన్న కాల్వలో పడి ప్రాణాలు వదిలాడు. సమాచారం అందుకున్న ఎస్సై కిరణ్‌కుమార్ తండాకు చేరుకుని బిచ్చు మృతిపై విచారణ చేపట్టారు. మృతుడి మనవడు సురేష్ ఫిర్యాదు మేరకు నగ్మా, దేవీలాల్, సక్కుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆస్తి పంపకాల విషయంలోనే ఈ ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

- భద్రాచలంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలో ఘటన
- భవనం పైనుంచి పడిందని కుటుంబీకులకు సమాచారం
- హత్యాయత్నం జరిగిందని తల్లి, బంధువుల ఆరోపణ



భద్రాచలం ఆస్పత్రిలో కారుణ్య

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని కూనవరం రోడ్డులో కొనసాగుతున్న ఓ నర్సింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని కారుణ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కళాశాలలోని హాస్టల్ భవనం మొదటి అంతస్తు నుంచి ఉదయం ఆమె కింద పడినట్లు గుర్తించిన సహచర విద్యార్థులు నిర్వాహకులకు తెలపగా 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలతో అక్కడ చికిత్స పొందుతూనే సాయంత్రం మృతి చెందింది. అయితే, ఘటనపై అనుమానాలు ఉన్నాయని, కారుణ్యపై హత్యాయత్నం జరిగిందని ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మేనమామ వద్ద ఉంటూ..

కారుణ్యది ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సిద్దినగర్ కాగా, కుటుంబ కారణాలతో ఆమె ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో మేనమామ ప్రవీణ్ వద్ద ఉంటోంది. నర్సింగ్ చేయాలనే కోరికతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చేరగా ఇప్పుడు మొదటి సంవత్సరం చదువుతోంది. ఇదే కాలేజీకి సంబంధించి మరోచోట ఉన్న హాస్టల్‌లో ఉంటుండగా.. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి గది నుంచి బయటకు వచ్చింది. ఆపై కొద్దిసేపటికే మరో విద్యార్థిని అటుగా వెళ్లడంతో కారుణ్య రక్తపు మడుగులో ఉండగా సహచర విద్యార్థులతో కలిసి కళాశాల నిర్వాహకులకు తెలిపారు. ఆపై 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, సీసీ పుటేజీని పరిశీలించగా కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన కారుణ్య, హాస్టల్ మొదటి అంతస్తుపైకి వెళ్తున్నట్లుగా కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఆ తర్వాత పుటేజీలో కారుణ్య కనిపించలేదని, అనంతరం మొదటి అంతస్తు నుంచి పడినట్లుగా నమోదైందని చెప్పారు. కాగా, కారుణ్యకు ఫిట్స్ ఉండటంతో మొదటి అంతస్తు పైనుంచి పడి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు.

అత్యవసర చికిత్స చేసినా..

తీవ్రంగా గాయపడిన కారుణ్యను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు తల, నుదుటి భాగంలో తీవ్ర గాయాలైనట్లు గుర్తించారు. ఆపై ఐసీయూలో చేర్చి చికిత్స చేస్తూనే, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రయత్నాల్లో ఉండగానే కారుణ్య కుటుంబీకులు మాత్రం ఇక్కడే చికిత్స చేయాలని పట్టుబట్టారు. దీంతో చికిత్స కొనసాగుతుండగానే ఆమె సాయంత్రం మృతి చెందింది.

నిజానిజాలు బయటకు రావాలి..

కారుణ్య ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ నిర్వాహకులు ఫోన్‌లో చెప్పడంతో ఆమె తాత కోట యాహు, తల్లి సునీత, చెల్లి ప్రశాంతి, మేనమామ ప్రవీణ్ వచ్చారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిందని చెప్పారని వారు తెలిపారు. అయితే, కారుణ్యను పరిశీలించినప్పుడు ప్రమాదవశాత్తు కింద పడినట్లుగా గాయాలు లేవని అనుమానిస్తే పొంతన లేని సమాధానం ఇచ్చారని ఆరోపించారు. ఆమెను ఎవరో కొట్టినట్లుగా అనుమానం ఉన్నందున పూర్తిస్థాయిలో విచారించాలని, హాస్టల్ నిర్వాహకులపై తమకు అనుమానం ఉందని వారు ఆస్పత్రి వద్దకు వచ్చిన భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని తెలిపారు.

కొనసాగుతున్న వెతుకులాట..

- ఇంకా ఆచూకీ లేని బాలుడు
- పసిబిడ్డ అదృశ్యమై నాలుగు రోజులు..
- నిద్రాహారాలు మాని ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు



తల్లితో సాయిదేవాన్ష్ (ఫైల్)



గుడారాల వద్ద గుమికూడిన సంచార జాతుల కుటుంబాలు

సత్తుపల్లి: ఎంత నిబ్బరంగా ఉందామనుకున్నా పాలు తాగే పసిగుడ్డు కానరాకుండా నాలుగు రోజులు అవుతుండడంతో ఆ తల్లి కంట కన్నీరు ఆగడం లేదు. ఏడ్చి ఏడ్చి గుండెలు అవిసిపోతున్నా కుమారుడి జాడ లేక కనిపించిన ప్రతీఒక్కరికి ఆచూకీ కోసం అడుగుతుండడం కలిచివేస్తోంది. సత్తుపల్లి పట్టణ శివారు గుడిపాడులో గుడారాలు వేసుకుని నివసిస్తున్న వానరాశి జంపన్న – దుర్గ దంపతుల కుమారుడు 11 నెలల బాలుడు సాయిదేవాన్ష్ ఈనెల 20వ తేదీ రాత్రి కానరాకుండా పోయాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు బాలుడి ఫొటోతో వెతుకులాట చేపట్టారు. ఎక్కడైనా బాలుడితో అనుమానస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. అయినా గురువారం సాయంత్రం వరకు జాడ లేకపోగా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాలుడి తల్లి దుర్గను ఆపడం ఎవరి తరం కావడం లేదు.

25ఏళ్లలో ఏనాడూ లేదు..

సత్తుపల్లి పట్టణ శివారు గుడిపాడులో 25 ఏళ్లుగా సంచార జాతుల ప్రజలు వచ్చి గుడారాలు వేసుకొని జీవిస్తున్నారు. గ్యాస్‌స్టౌవ్, మిక్సీ, కూలర్లు మరమ్మతులు చేస్తూ సీజన్ వారీగా పనులు ఉన్నచోటకు వెళ్తుంటారు. గుడారాల వద్ద నుంచి కనీసం 50కిలోమీటర్ల మేర తిరుగుతూ పనులు చేసుకుంటున్న వీరు ఎక్కడికైనా వెళ్లినా తిరిగి వచ్చి గుడారాలు వేసుకొని రెండు నుంచి మూడు నెలలు ఉంటారు. ఇందులో కొందరు పిల్లలను ఇళ్ల వద్ద వదిలేస్తే, మరికొందరు తమ వెంట తీసుకెళ్తారు. అయితే, 25 ఏళ్లలో ఇలాంటి ఘటన ఏనాడు జరగకపోవడం, ఇప్పుడు 11నెలల బాబు కానరాకుండా పోవడంతో ఏం జరిగిందో తెలియక ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యేక బృందాలతో..

బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు సత్తుపల్లి పోలీసులు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశామని సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు. బాలుడిని ఎత్తుకెళ్లారని భావిస్తున్న వాహనాన్ని గుర్తించేందుకు సమీపంలోని సీసీ కెమెరా పుటేజీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలు రైతులు సద్వినియోగం చేసుకుని జీవాలను కాపాడుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి(డీవీఏహెచ్ఓ) డాక్టర్ కె.వెంకటనారాయణ సూచించారు. మండలంలోని పెద్దగోపతిలో గురువారం జీవాలకు వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వానాకాలం పశువుల్లో గాళ్ల వ్యాధి, గురక వ్యాధి, జబ్బ వాపు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే, గొర్రెల్లో చిటుకు రోగం నివారణకు టీకా వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీడీఎల్ డాక్టర్ అరుణ, మండల పశువైద్యాధికారి బి.శ్రీనివాస నాయక్, ఏఎస్‌లు నాగేశ్వరరావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఈనెల 31వరకు వ్యాక్సినేషన్

ఖమ్మంవ్యవసాయం: జీవాల్లో చిటుకు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. ప్రభుత్వం పశుసంవర్ధక, పశు వైద్య శాఖ ద్వారా ఈనెల 31వ తేదీ వరకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈమేరకు పెంపకందారులు, రైతులు జీవాలకు వ్యాక్సిన్ వేయించాలని జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారి డాక్టర్ అరుణ సూచించారు.

బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలి

నేలకొండపల్లి: పర్యాటక ప్రాంతమైన నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటుచేయాలని బౌద్ధ ఉపాసకులు కోరారు. బౌద్ధక్షేత్రం వద్ద గురువారం జరిగిన బుద్ధ పూర్ణిమ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలంలో బుద్ధుడి విగ్రహాల తయారీ కేంద్రంగా ఉన్న నేలకొండపల్లిలో ఆయన విగ్రహం లేకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

భద్రాచలం: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించేందుకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న 585 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరగగా 700 మందికి పైగా బాలికలు హాజరయ్యారని తెలిపారు.


ఒడిశా యువకులపై ట్రాన్స్‌జెండర్ల దాడి

ఖమ్మంక్రైం: ముంబై నుంచి ఒడిశా వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం ఒడిశా యువకులపై ట్రాన్స్‌జెండర్లు దాడికి పాల్పడ్డారు. రైలు వెనక వైపు ఉన్న జనరల్ బోగీలో ఎక్కిన ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ప్రయాణికులను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారు. ఈనేపథ్యాన బలరామ్ వారు అడిగినంత డబ్బు ఇచ్చులేనని చెప్పడంతో ఆయనతో పాటు పక్కనే ఉన్న యువకుడిపై దాడి చేశారు. ఆపై అసభ్యంగా దూషిస్తుండగా సహచర ప్రయాణికులు వారిస్తే వారినీ దుర్భాషలాడారని తెలిపారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపాన ఈ ఘటన జరగగా, సదరు యువకులు ఖమ్మంలోని రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే, ఖమ్మం జీఆర్పీ పోలీసులు మాత్రం ఇక్కడ కొద్దిసేపే రైలు ఆగడంతో విజయవాడలో ఫిర్యాదు చేసి ఉంటారని వెల్లడించారు. ఇదిలా ఉండగా రైళ్లలో ట్రాన్స్‌జెండర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ దాడులకు పాల్పడుతున్నా జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

ముదిగొండ: ప్రమాదవశాత్తు బావిలో పడిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన ముదిగొండలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న యామాల రాము (45) ఓ వ్యవసాయ బావి వద్ద దాహం వేయడంతో దప్పిక తీర్చుకునేందుకు బావిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడగా నీట మునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు ఇచ్చినసమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై రాము సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి డిగ్రీ కళాశాల ఉద్యోగి...



ప్రసాద్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ద్విచక్రవాహనంపై వస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉద్యోగికి ట్రాక్టర్ కల్టివేటర్ తాకడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఆత్మకూరి ప్రసాద్(38) సత్తుపల్లి ప్రభుత్వ జేవీఆర్ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సత్తుపల్లిలోని కృషి బైపాస్‌రోడ్డులో నివాసముండే ఆయన గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై రాజీవ్‌నగర్ వెళ్లి వస్తుండగా సిద్దారం రోడ్డులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ కల్టివేటర్ కడుపులో దిగబడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చే సరికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రసాద్‌కు భార్య విజయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రేకుల పైనుంచి పడిన వ్యక్తి...

సత్తుపల్లిరూరల్: రేకులను సరి చేస్తుండగా జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన పిన్నబోయిన శ్రీనివాసరావు(45) తన ఇంటి పరంజా రేకులు కురుస్తుండడంతో గురువారం పైకి ఎక్కి సరి చేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు జారిపడగా తలకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.